క్లుప్తంగా

పీజీ మూల్యాంకనం ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ జవాబుపత్రాల మూల్యాంకణం ప్రారంభమైందని పీజీ ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు. వరం రోజుల్లో వాల్యుయేషన్ పూర్తి చేసి త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు.

నవోదయకు బాతువ విద్యార్థిని ఎంపిక


దేవిక

జి.సిగడాం: బాతువ పాఠశాలలో 5వ తరగతి చదుతున్న కూనిబిల్లి దేవిక నవోదయ విద్యాలయానికి ఎంపికై నట్లు హెచ్ఎం ఎస్‌వీఆర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని, గైడ్ మొయ్యి జనార్దనరావును అభినందించారు.

రేషన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

జి.సిగడాం: లబ్ధిదారులు ఈ నెల 30లోగా ఈకేవైసీ చేయకపోతే రేషన్ సరుకుల సరఫరా నిలిచిపోతుందని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ స్పష్టం చేశారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో దండోరా వేయించామని, డీలర్ల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో డీటీలు ఎస్.నిర్మల, కె.గాయిత్రి, ఆర్‌వి రాధ, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అసిరిపోలమ్మ తల్లి ఉత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ, పరిసర ప్రాంత గ్రామాల్లో జరుగుతున్న అసిరిపోలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

పారిశ్రామిక రంగంపై దృష్టిపెట్టాలి


యువతకు శిక్షణ ఇస్తున్న కలేబ్

ఎచ్చెర్ల క్యాంపస్: యువత పారిశ్రామిక రంగంపై దృష్టిపెట్టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విశాఖపట్నంకు చెందిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీస్ ట్రైనర్ ఎం.కలేబ్ అన్నారు. ఈ మేరకు ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్‌వీ రమణమూర్తినాయుడు, హెచ్ఓడీలు తిరుమలరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

యువ పార్లమెంట్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున ఎస్.సాయిప్రదీప్ (యూనివర్సిటీ ఇంజినీరింగ్ ఈసీఈ విభాగం), జి.రాజేశ్వరి (శ్రీకాకుళం కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల)లు ఇటీవల విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ పార్లమెంట్ పోటీల్లో ఎంపికయ్యారు. ఢిల్లీలో జాతీయ స్థాయిలో యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ నిర్వహించే యువ పార్లమెంట్ పోటీల్లో పాల్గొంటారు. వీరిని వీసీ కె.ఆర్.రజిని బుధవారం అభినందించారు.

కాలువలు నిర్మించాలని వినతి


కమిషనర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న జగన్నాథనగర్ కాలనీవాసులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చాపురం పరిధిలోని జగన్నాథనగర్‌కాలనీలో మురుగుకాలువలు నిర్మించాలని, పారిశుద్ధ్యం పనులు మెరుగుపరచాలని కోరుతూ స్థానికులు బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కాలువలు లేక ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచి అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

రంగస్థల సేవలకు.. సత్కారం

రంగస్థలంపై అడుగుపెట్టారంటే వారికి తిరుగే లేదు. తమ అద్భుత నటనా ప్రదర్శనతో సన్నివేశాలకు జీవం పోస్తూ ప్రేక్షకులను మైమరపిస్తూ వేలాది ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నటన, దర్శకత్వం, సంగీతం.. ఇలా రంగమేదైనా తమదైన శైలితో దశాబ్దాల పాటు అభిమానులను అలరించారు. వారిలో కొందరు నేటికీ కళామ తల్లి సేవలో కొనసాగుతుండగా.. మరికొందరు వయోభారంతో ఇంటి వద్దే ఉంటున్నారు. అలాంటి కళాకారులను గుర్తుంచుకుంటూ, వారి ఇళ్లకే వెళ్లి సన్మానం చేస్తున్నారు జిల్లా కేంద్రానికి చెందిన రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు. ముంగిట సత్కారం పేరిట వినూత్నంగా కళాకారులను సన్మానిస్తూ భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


ఈ ఏడాది సత్కారం అందుకోబోతున్న కళాకారుడు లోకనాథం రామలింగ స్వామి

- 16 ఏళ్లుగా కళాకారులకు 'ముంగిట సత్కారాలు'
- ఇళ్ల వద్దకే వెళ్లి సన్మానం చేస్తున్న కళాకారుల సమాఖ్య
- నేడు సీనియర్ నటుడు రామలింగ స్వామికి సన్మానం


సంగీత దర్శకుడు బందారు చిట్టిబాబుకు ఇంటి వద్ద సత్కారం చేస్తున్న కళాకారులు (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: సామాజిక రుగ్మతలను ఎత్తిచూపి, వాటికి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యం చేయడంలో నాటక ప్రదర్శనలు ముందుండేవి. సినిమా, టీవీలు వచ్చాక కాలక్రమేణా ఆదరణలో కొంత వెనుకబాటుకు గురైనప్పటికీ రంగస్థలంపై ఉన్న అభిమానంతో కళాకారుల సమాఖ్యలు, అభిమానులు, దాతలు తమవంతు ప్రోత్సాహాన్నిస్తూ నాటక రంగానికి ఊపిరిపోస్తున్నారు. సీనియర్ కళాకారులను సత్కరిస్తూ వారి సేవలను నేటితరానికి తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు వినూత్న సత్కారాలకు తెరతీశారు. ఎక్కడా లేని విధంగా కళాకారుల ఇంటికే వెళ్లి 'ముంగిట సత్కారం' పేరిట కుటుంబ సభ్యుల సమక్షంలో సముచిత రీతిలో సన్మానం చేస్తున్నారు.


సాంఘిక నాటికలో సన్నివేశం

నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం

16 ఏళ్లుగా సత్కారాలు..

రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఏటా మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం నాడు కళాకారులను సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా సీనియర్ నటులు, వృద్ధాప్యంతో ఇంటి వద్దనే ఉంటున్న కళాకారులను ఎంపిక చేస్తారు. వారి ఇంటికి వెళ్లి 'ముంగిట సత్కారం' పేరుతో కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య ఎటువంటి ఆర్భాటాలు లేకుండా సత్కరిస్తారు. 2009 నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇక్కడ నిర్వహిస్తున్న ముంగిట సత్కారం కార్యక్రమంతో స్ఫూర్తి పొంది తిరుపతి, చీరాల, తెనాలి, అనకాపల్లిలో సైతం ఇటువంటి సత్కారాలు ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటి వరకు దూసి గురునాథరావు, దూసి బెనర్జి, కనకం ముఖలింగం మాస్టారు, ఎం.లక్ష్మణరావు, బందారు చిట్టిబాబు వంటి సంగీత కళాకారులు.. వి.శ్రీనివాసరావు, కె.వీరాచారి, మత్రివలస మాస్టారు, లాడి రంగనాథం, చల్లపల్లి సన్యాసిరావు వంటి పౌరాణిక నటులు.. వి.భార్గవి ప్రసాద్, ఎ.మోహనరావు, ఎల్.నందికేశ్వరరావు, నిక్కు హరిసత్యనారాయణ వంటి సాంఘిక నాటక కళాకారులను సత్కరించారు.

ఐదు దశాబ్దాలుగా కళామ తల్లి సేవలో..

సాంఘిక, జానపద నాటకాలలో విలక్షణ పాత్రలను పోషిస్తూ నటుడిగా రాణిస్తున్న కళాకారుడు లోకనాథం రామలింగస్వామి. పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో నివాసముంటున్న ఈయన 50 ఏళ్లుగా కళామతల్లి సేవలో తరిస్తున్నారు. ఎన్నో నాటకాలలో నటించడమే కాకుండా కళాసమితులు స్థాపించి ఎందరో నటులను ప్రోత్సహించారు. 1949లో జన్మించిన ఈయన వృత్తి రీత్యా చిత్రలేఖనోపాధ్యాయుడు. శ్రీకాకుళం పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. 1968లో స్నేహితులతో కలిసి లలితశ్రీ కళాసమితి సంస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా అనేక ప్రఖ్యాత ప్రదర్శనలు ఇస్తున్నారు. నాటకాలు, సినిమాలలో నటుడిగా సన్మానాలు, సత్కారాలు పొందారు. నటవిశారద బిరుదు కూడా అందుకున్నారు. ప్రస్తుతం రంగస్థల కళాకారుల సమాఖ్యలో నిర్వహిస్తున్న నెలవారీ సాంస్కృతిక విభాగంలో కార్యానిర్వాహక అధ్యక్షునిగా వ్యవహరిస్తూ కళారంగానికి సేవలను కొనసాగిస్తున్నారు.

ఎచ్చెర్ల పరువు తీసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- సీఎం, డిప్యూటీ సీఎంల మెప్పు కోసం వైఎస్ జగన్‌ను దూషించడం సరికాదు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మెప్పుకోసం ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఏక పదజాలంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దూషించడం సరికాదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాలు అనంతరం నిర్వహించిన స్కిట్ ప్రదర్శనల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రౌడీల తరహాలో మాట్లాడి ఎచ్చెర్ల పరువును రోడ్డున పడేశారని మండిపడ్డారు. పదిమంది గొప్ప కోసమో.. నాయకుల మెప్పు కోసమో ఇలాగే మాట్లాడితే క్షమించేది లేదన్నారు. స్థాయి గుర్తించి మాట్లాడాలని హితవుపలికారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఏ సంక్షేమ పథకం కూడా అమలు చేయలేక ప్రగల్భాలు పలికితే సహించేది లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, నాలుగు మండలాల అధ్యక్షులు డోల వెంకటరమణ, దన్నాన రాజీనాయుడు, గొర్లె శ్రీనివాసరావు, బోర సాయిరాం, లావేరు జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, నాయకులు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, బొంతు సూర్యనారాయణ, మజ్జి రమేష్, పోశపు రాందాసు, దన్నాన హరి, బోర గోవిందరెడ్డి, పాత్రుని రమణ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లతో జీవితం నాశనం


దీక్ష చేపడుతున్న భానోజీరావు

ఎచ్చెర్ల: బెట్టింగ్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని వైఎస్సార్ సీపీ నాయకుడు భానోజీరావు యువతకు హితవుపలికారు. ఈ మేరకు బుధవారం చిలకపాలెం జంక్షన్‌లో ఒక్కరోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్‌ల వల్ల అనేక కుటుంబాలు దిక్కులేని స్థితికి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మహనీయుల ఆశయ సాధనలో ముందుకు సాగలే తప్ప తప్పుడు మార్గంలో పయనించి జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో మురపాక వైఎస్సార్ సీపీ నాయకుడు బాలి శ్రీనివాసులనాయుడు, పెయ్యల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

రణస్థలం: ఈ-పంట, ఈకేవైసీ నమోదు పూర్తి చేసిన రైతులకు వ్యవసాయశాఖ ఏవో డి.విజయభాస్కర్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వల్లభరావుపేట పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాంకేతికత, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే విషయ పరిజ్ఞానాన్ని అందించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ-క్రాప్ సోషల్ ఆడిట్ జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని, రైతులు పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఏవో విజయభాస్కర్

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అరుణకుమారి అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ, పూర్వపు ప్రాథమిక విద్యపై శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్ శరణ్య, ప్రాజెక్టు అధికారి డి.పాపినాయుడు పర్యవేక్షించారు.

పంట నష్టం పరిశీలన


నేలమట్టమైన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ పరిధిలో ఇటీవల ఈదురు గాలులు, అకాల వర్షాలకు నేలమట్టమైన రబీ వరి పంటను బుధవారం వ్యవసాయశాఖ జేడీ బి.రజిని, శాస్త్రవేత్తలు పి.ఉదయబాబు, మధుకుమార్, అధికారులు పరిశీలించారు. జిల్లా వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు, స్థానిక నాయకుడు అల్లు తులసీరావు పంట నష్టాన్ని అధికారులకు వివరించారు. బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం నేలకొరిగిన పంటను కాపాడుకునేందుకు అధికారులు పలు సూచనలు చేశారు.

ఘనంగా అన్నమయ్య స్వరార్చన


స్వరార్చన చేస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: తాళ్లపాక అన్నమాచార్య 52వ వర్ధంతి సందర్భంగా బలగ హరేరామ మందిరంలో బుధవారం స్వరార్చన గ్రూప్ అడ్మిన్ సింహాద్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంకీర్తనలు ఆలపించారు. విశాఖకు చెందిన వీఆర్ఆర్ పద్మజ, 30 మంది గాయనీ గాయకులు అన్నమయ్య కీర్తనలతో ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, ఠాకూర్‌దాస్, విశ్వనాథం, సంతోష్ బ్రహ్మ, మైలపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి అన్నాభిషేకం



లోక కల్యాణార్థం రామచంద్రాపురం పంచాయతీ జొన్నల పాడులోని ఉమా సహిత కాశీ విశ్వేశ్వర దేవాలయంలో బుధవారం శాస్త్రోక్తంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఫాల్గుణ మాసం సందర్భంగా అర్చకులు వీరభద్రాచారి ఆధ్వర్యంలో పంచామృతాలతో పాటు భక్తులు తెచ్చిన శుద్ధ జలాలతో అభిషేకాలు చేశారు.

– గార

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ పూజలు



ఫరీదుపేటలోని భూ, నీలా, గోదా సమేత రంగనాథస్వామి ఆలయంలో బుధవారం పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ పూజలు చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సేవా ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వస్త్రపురికాలనీలో పారిశుద్ధ్య లోపం



మండల కేంద్రం లావేరుకు కూతవేటు దూరంలో ఉన్న వస్త్రపురం కాలనీలో పారిశుద్ధ్యం లోపించింది. ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు పేరుకుపోయి, దోమల బెడద ఎక్కువైంది. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

ఉపాధి పనుల్లో అవకతవకలు

రణస్థలం: ఉపాధి పనుల్లో భాగంగా పంచాయతీల్లో నాటిన మొక్కల్లో సగానికిపైగా పెరగకపోవడం, కొన్నిచోట్ల మొక్కలు లేకపోవడంపై ఏపీడీ, జిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజర్ ఆర్.స్వరూపరాణి ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై డ్వామా పీడీ బి.సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం 17వ విడత సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. మస్టర్లో దిద్దుబాట్లు, సంతకాలు లేనట్లు గుర్తించి రూ.లక్షా 26వేలు రికవరీ రాశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు పిన్నింటి సాయికుమార్, ఏపీడీ కె.లోకేష్, ఎం.శైలజ, హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఏఈ ఎల్.అప్పన్న, ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు, సీఈ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.


సోషల్ ఆడిట్ సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం


కూన కిరణ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం కొనసాగుతోందని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ కక్షసాధింపు రాజకీయాలు కొనసాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ కార్యాకర్త, పూర్వపు వలంటీర్ కూన కిరణ్‌కుమార్‌ను ఫరీదుపేటలో, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న సర్పంచ్ ఇందుమతి భర్త, మాజీ సర్పంచ్ బల్లాడ వెంకట అప్పారావు రెడ్డిని కుప్పిలిలో బుధవారం పరామర్శించారు. కిరణ్‌కుమార్‌పై దాడి ఘటనను రాష్ట్రస్థాయిలో అధిష్ఠానానికి, లీగల్ బృందం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పరామర్శల్లో జెడ్పీటీసీ బల్లాడ హేమమాలినీరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాం రెడ్డి, మండల విప్ బగ్గ రాజారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బోర గోవిందరెడ్డి, పాత్రుని రమణ, పైడి వెంకన్నగారి శ్రీను, మొదలవలస సతీష్, మొదలవలస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

• ఆత్మీయ కలయిక



నగరానికి చెందిన భగవత్కృప శ్రీమద్ భగవద్గీత గ్రూపు సభ్యులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వీరంతా ఐదేళ్లుగా ప్రతిరోజూ రెండు శ్లోకాలు భగవద్గీత పారాయణ చేస్తున్నారు. 20మంది సభ్యులతో ప్రారంభమై నేడు 194 మందికి చేరింది. ఇప్పటికి మూడుసార్లు 18 అధ్యాయాలు పూర్తిచేసుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్